క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో మతీన్‌కు రజత పతకం



గుంటూరు ఎడ్యుకేషన్: జమ్మూ కశ్మీర్‌లో ఇటీవల జరిగిన ఫెడరేషన్ కప్ ఎక్యూపడ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ 2022–23లో ఆంధ్ర ముస్లిం జూనియర్ కళాశాల విద్యార్థి షేక్ అబ్దుల్ మతీన్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ షేక్ షమీమ్ బేగం తెలిపారు. పొన్నూరు రోడ్డులోని కళాశాలలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో అబ్దుల్ మతీన్‌ను అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ షేక్ సుభాని, అధ్యక్షుడు అబ్దుల్ రెహ్మాన్ నగదు పురస్కారాన్ని అందజేశారు. ఏషియన్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించడంపై అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించి, కళాశాల ఖ్యాతిని ఇనుమడింపచేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పద్మ పురాణ ప్రవచనం



పాత గుంటూరు: ఏటీ అగ్రహారంలోని కంచి కామకోటి పీఠ శ్రీ శంకర గాయత్రీ దత్తసాయి సత్యదేవ మందిరంలో గాయత్రీ వేద శాస్త్ర పరిషత్ ఆధ్వర్యంలో శుక్రవారం కె.వి.యల్.యన్. అప్పలాచార్యులు శ్రీ పద్మపురాణ ప్రవచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు రాళ్లబండి వెంకట సత్య రామాంజనేయశర్మ, భట్టిప్రోలు నరసింహారావు, ముళ్లపూడి సత్య నారాయణశాస్త్రి, సభ్యులు పాల్గొన్నారు.

భక్తిప్రపత్తులతో కుంకుమ పూజలు



పాత గుంటూరు: కొరిటిపాడు ఆంజనేయపేటలో శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్య తిరునాళ్ల వైభవంగా జరుగుతోంది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ప్రభాత సేవ, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, చండీ హోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం సువాసినులు భక్తిప్రపత్తులతో కుంకుమార్చన గావించారు. ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయ్‌కుమార్ మాట్లాడుతూ శనివారం మహా అన్నసంతర్పణ నిర్వహిస్తున్నామని, భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు. ఏర్పాట్లను బాజీ పర్యవేక్షించారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో వ్యక్తిని మోసం చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోబాల్ట్ పేటకు చెందిన షేక్ నబీ గుంటూరు వారితోటలోని ఒడాఫోన్ షోరూంలో పని చేస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తి శుక్రవారం ఫోన్ చేసి ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుకు ప్రొడక్షన్ చార్జీలు పడుతున్నాయని చెప్పడంతో సీవీవీ నంబరు, ఇతర వివరాలు తెలిపారు. కొంతసేపటి తరువాత రూ. 37వేలు కార్డు నుంచి డ్రా అయినట్లు గుర్తించిన బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేలం పాటలో షాపు కేటాయింపు

గుంటూరు ఈస్ట్: నాజ్ సెంటర్‌లోని నూనె నరసింహం ధర్మసత్రంలోని ఓ షాపును వేలం పాటలో అద్దెదారుడు దక్కించుకున్నట్లు ఈవో వెంకట కృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెలకు రూ. లక్ష అద్దె చెల్లించే విధంగా జగదీశ్వరరెడ్డి షాపు దక్కించుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గ్యాస్ లీకై మహిళకు తీవ్ర గాయాలు

చేబ్రోలు: ప్రమాదవశాత్తూ గ్యాస్ లీకై మంటలు వ్యాపించి సిలిండర్ పేలిపోవడంతో మహిళకు తీవ్ర గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గొడపాలెంలో శుక్రవారం జరిగింది.సిలిండర్ నుంచి గ్యాస్ లీకవుతున్న విషయాన్ని గమనించకుండా యెనుముల రమాదేవి పొయ్యి వెలిగించే ప్రయత్నంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించి పేలిపోయింది. ఈ సంఘటనలో భవనంలోని గోడలు బీటలు వారాయి. ఫర్నిచర్ పూర్తిగా దెబ్బతింది. మంటల తాకిడికి డాబా సీలింగ్ కాలిపోయింది. రమాదేవికి తీవ్రంగా కాలిన గాయాలవటంతో 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

కీళ్ల నొప్పులు ఇంతింత కాదయా...

- ఆధునిక జీవనంతో నొప్పుల సమస్యలు అధికం
- ముందస్తు జాగ్రత్తలతో చెక్



గుంటూరు మెడికల్: కీళ్ల నొప్పులు సాధారణంగా వయస్సు పైబడిన వారిలో ఎక్కువగా ఉంటాయి. పంట పొలాల్లో కష్టపడి పని చేసుకుంటూ వ్యాధులపై ఏ మాత్రం అవగాహన లేని గ్రామీణులు మాత్రమే గతంలో ఎక్కువగా వైద్యుల వద్ద ప్రస్తావించేవారు. నేటి ఆధునిక జీవనశైలిలో పల్లె, పట్నం అనే తేడా లేకుండా బాధితులు అధికంగా కనిపిస్తున్నారు. రానురానూ సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది. గతంలో 60 ఏళ్ల పైబడిన వారు మాత్రమే వ్యాధి బారిన పడేవారు. నేడు 40 ఏళ్లకే బారిన పడుతున్నారు. నొప్పులపై అవగాహనతో పాటు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా బాధల నుంచి బయటపడొచ్చని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

బాధితులు అధికమే..

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతి ఆరుగురిలో ఒకరు కీళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. తాగే నీటిలో ఫ్లోరిన్ అధికంగా ఉండటం వల్ల పల్నాడు జిల్లా ప్రజలు ఎక్కువగా ఆర్థ్రరైటిస్ బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్ ఆర్థోపెడిక్ విభాగానికి ప్రతిరోజూ వివిధ సమస్యలతో 300 మంది వస్తున్నారు. వీరిలో సుమారు 160 మంది వరకు ఆర్థ్రరైటిస్ వ్యాధి బాధితులే. ఆడవాళ్లకు 40 ఏళ్లలోపే కీళ్లనొప్పులు వస్తుండగా మగవారికి 60 ఏళ్లకు వస్తున్నాయి. ఆడవాళ్లు 60 శాతం, మగవాళ్లు 40శాతం వ్యాధితో బాధపడుతున్నారు. నొప్పుల నుంచి విముక్తుల్ని చేసి వృద్ధాప్యంలో మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు నేడు ఆధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయి.

కీళ్ల అరుగుదల వీరిలో ఎక్కువ

కీళ్ల అరుగుదల శరీరంలో ఏ భాగంపై నైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. అరుగుదల కారణంగా ప్రధానంగా మోకాళ్లు, తొంటి, నడుము, మెడ దెబ్బతింటాయి. పొగ తాగేవారు, స్థూలకాయం, 55 సంవత్సరాలు పైబడిన వారు, గతంలో కీళ్లకు దగ్గరగా ఫ్రాక్చర్ అయిన వారు, కీళ్లవాతంతో బాధపడేవారు, కొన్ని రకాల ఇన్‌ఫెక్షన్స్, రుతుక్రమం ఆగిపోయిన మహిళల్లో అరుగుదల ఉంటుంది.

పది శాతం మందికే ఆపరేషన్లు అవసరం



నొప్పులు అధికంగా ఉంటే తప్పనిసరిగా వైద్యుల పర్యవేక్షణలో అవసరమైన మేరకే మందులువాడాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆహారపు అలవాట్లు, జీవన విధానాన్ని మార్చుకోవడం ద్వారా చాలా వరకు వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు. నేడు స్టెమ్‌సెల్స్ థెరపీ, ప్లేట్‌లెట్ రిచ్ ప్లాస్మా, మొజైక్ ప్లాస్టీ లాంటి ఆధునిక వైద్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. మోకాళ్లు పూర్తిగా అరిగి దినచర్య కష్టతరమై, కీళ్లు వంకరపోయిన వారికి మాత్రమే శస్త్రచికిత్స అవసరం. నొప్పులతో బాధపడే ప్రతి వంద మందిలో కేవలం ఐదు నుంచి పది శాతం మందికి మాత్రమే ఆపరేషన్ అవసరమవుతుంది.

– డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు

అపోహలు వీడాలి

కీళ్ల అరుగుదల నివారించలేరనే అపోహ ప్రజల్లో ఉంది. వాతం నొప్పులు, కీళ్లలో చీము చేరడం వల్ల వచ్చే నొప్పులు, విరిగిన ఎముకల వల్ల కలిగే నొప్పులకు సరైన సమయంలో వైద్యం చేస్తే నివారించవచ్చు. మోకాలు, తుంటి నొప్పితో బాధపడే వారికి ఆపరేషన్ అవసరమా.. కాదా అనేది వైద్యులు నిర్ణయిస్తారు. నొప్పుల్లో స్వల్పం, మధ్యస్థంగా ఉన్నవారికి ఆపరేషన్ అవసరం లేదు.

మానసిక ప్రశాంతతోనే విజయం సాధ్యం

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ వి. రాధికారెడ్డి



సదస్సులో సమర్పిస్తున్న పరిశోధన పత్రాల సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రాజశేఖర్, డాక్టర్ రాధికారెడ్డి తదితరులు

ఏఎన్‌యూ: మానసిక ప్రశాంతతోనే విజయం సాధ్యమని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాధికారెడ్డి తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ సైకాలజీ విభాగం ఆధ్వర్యంలో 'టుడేస్ యూత్: ఛాలెంజెస్ అండ్ సైకలాజికల్ వెల్ బీయింగ్' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో డాక్టర్ రాధికారెడ్డి కీలకోపన్యాసం చేశారు. చిన్నచిన్న సమస్యలకే యువత మానసిక ఒత్తిడికి గురికావడం అనేక సమస్యలకు కారణమవుతోందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానం వల్ల కూడా సమస్యలు ఎదుర్కొంటున్నారని, అవి జీవితానికి సవాలుగా కూడా మారుతున్నాయని పేర్కొన్నారు. మానసిక సమస్యలకు గురైన తరువాత వాటి నుంచి బయట పడాలనుకోవడం కంటే అసలు గురికాకుండా యువత వ్యవహరించాలని సూచించారు. యూనివర్సిటీ వీసీ పి. రాజశేఖర్ ప్రసంగిస్తూ మనిషి విజయంలో దృఢమైన మనస్తత్వం ఎంతో కీలకమని తెలిపారు. సంగీతం, నృత్యం, సాహిత్యం వంటి పలు కళల్ని అభ్యసించడం ద్వారా యువత మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని ఆయన సూచించారు. సదస్సు డైరెక్టర్ డాక్టర్ బట్టు నాగరాజు అధ్యక్షోపన్యాసం చేస్తూ ప్రస్తుతం యువత అనేక మానసిక సమస్యలు ఎదుర్కొంటోందని, వాటి పరిష్కార మార్గాలపై చర్చించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నామని వివరించారు. ఎస్‌ఈఐఎఫ్ చైర్ పర్సన్ డాక్టర్ శ్యామ్యూల్ రెడ్డి, ఏఎన్‌యూ రిజిస్ట్రార్ బి.కరుణ, ఓఎస్‌డీ కె.సునీత, పాండిచ్చేరి యూనివర్సిటీ ప్రతినిధి వి. భరణి కాంత్, ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకురాలు కె. స్వాతి, ఇగ్నో అధ్యాపకుడు బి. ప్రసాద్, ఎన్నారై వైద్యకళాశాల అధ్యాపకులు ఫణి భూషణ్, సైకాలజీ విభాగ కో–ఆర్డినేటర్ టీడీ విమల, అధ్యాపకులు వసంతరావ్ పాల్గొన్నారు. సదస్సులో సమర్పిస్తున్న పరిశోధనా పత్రాల సావనీర్‌ను వీసీ ఆవిష్కరించారు.

రోజువారీ జీవితంలో ఆర్థిక శాస్త్రం భాగం

మనిషి రోజువారీ జీవితంలో ఆర్థిక శాస్త్రం భాగమని రెక్టార్ పి. వరప్రసాదమూర్తి తెలిపారు. నాగార్జున యూనివర్సిటీ ఆర్థిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో '75 సంవత్సరాల భారతదేశ ఆర్థిక వ్యవస్థ – ఆర్థిక వృద్ధి, పంపిణీ సమన్యాయం' అనే అంశంపై జరిగిన జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రెక్టార్ ప్రసంగిస్తూ నేటి సమాజంలో ఆర్థిక సమన్యాయముతోనే సామాజిక సమన్యాయం సాధ్యమవుతుందని తెలిపారు. ఓఎస్‌డీ కె. సునీత ప్రసంగిస్తూ ఆర్థిక సమానత్వంతో సామాజిక, ఇతర అంశాలు ఎంతో సంబంధం కలిగిఉన్నాయని పేర్కొన్నారు. సదస్సు డైరెక్టర్ కె. మధుబాబు నివేదికను సమర్పించారు. రెండు రోజులపాటు జరిగిన జాతీయ సదస్సులో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలకు చెందిన విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల నుంచి అధ్యాపకులు, ఆర్థిక రంగ నిపుణులు హాజరై 114 పరిశోధన పత్రాలు సమర్పించారు. రెక్టార్ వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అకడమిక్ ఎగ్జిబిషన్ విజయవంతానికి సమష్టి కృషి అవసరం

యూనివర్సిటీలో నిర్వహిస్తున్న అకడమిక్ ఎగ్జిబిషన్ విజయవంతానికి సమష్టి కృషి అవసరమని వీసీ పి. రాజశేఖర్ సూచించారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరగనున్న అకడమిక్ ఎగ్జిబిషన్ ఏర్పాట్లపై శుక్రవారం యూనివర్సిటీ అధికారులు, ఏర్పాట్ల కమిటీ ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అధికారులు, ఏర్పాట్ల కమిటీలు, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులందరూ ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని చెప్పారు. సోమవారంలోగా ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. అకడమిక్ ఎగ్జిబిషన్ కో–ఆర్డినేటర్ కె. మధుబాబు మాట్లాడుతూ గతంకంటే రెట్టింపు స్థాయిలో స్టాల్స్‌లో ప్రదర్శనలు జరిగే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రెక్టార్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ బి. కరుణ పలు అంశాలపై సూచనలు చేశారు.

నాక్ ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు

యూనివర్సిటీకి అత్యంత ప్రతిష్టాత్మకమైన నాక్ బృందం పర్యటన ఏర్పాట్లలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని వీసీ పి. రాజశేఖర్ తెలిపారు. సమీక్షా సమావేశంలో ఆయన నాక్ ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ప్రతి విభాగం పది రోజుల్లో అకడమిక్ ఆడిట్ పూర్తి చేయాల్సిందేనని ఆదేశించారు. 2014 నుంచి జాతీయ సదస్సుల నిర్వహణకు యూనివర్సిటీ నుంచే ఆర్థిక సహకారం చేస్తున్నామని, సదస్సుల నిర్వాహకులు మాత్రం యూజీసీ ఆర్థిక సహకారం అని రాస్తున్నారని దీని వల్ల నాక్ స్కోర్ తగ్గే అవకాశం ఉందని చెప్పారు. దీనిని విభాగాధిపతులందరూ సరిదిద్దుకోవాలని ఆయన సూచించారు.

ఏఎన్‌యూ, ఎస్‌ఈఐఎఫ్ మధ్య ఎంఓయూ

నాగార్జున యూనివర్సిటీ, ఎస్‌ఈఐఎఫ్(శామ్యూల్ ఈదా ఇంటర్నేషనల్ ఫౌండేషన్ మధ్య ఎంఓయూ ఖరారయ్యింది. యూనివర్సిటీలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీసీ సమక్షంలో ఏఎన్‌యూ రిజిస్ట్రార్ బి. కరుణ, ఎస్‌ఈఐఎఫ్ చైర్మన్ ఈదా శామ్యూల్ రెడ్డి ఎంఓయూ పత్రాలు మార్చుకున్నారు. సైకాలజీ రంగంలోని విద్య, పరిశోధనాంశాలలో రెండు సంస్థలు సంయుక్తంగా చర్యలు చేపట్టనున్నాయి.

అభివృద్ధి పనుల్లో నాణ్యత తప్పనిసరి

నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్

నెహ్రూనగర్: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని నగరపాలక సంస్థ కమిషనర్ కీర్తి చేకూరి అధికారులకు చెప్పారు. ఆమె శుక్రవారం విద్యానగర్‌లో రూ.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్, రూ.10లక్షలతో చేపట్టిన కొరిటిపాడు మెయిన్ రోడ్డు డివైడర్ మరమ్మతులు, పండరీపురంలో రూ.45 లక్షలతో చేపట్టిన సీసీ డ్రెయిన్ పనులు, రూ.1.80 కోట్లతో విస్తరణ, డ్రెయిన్ టు డ్రెయిన్, రోడ్డు నిర్మాణం చేపట్టనున్న జేకేసీ కాలేజీ రోడ్డు తదితర ప్రాంతాల్ని పరిశీలించారు. నాణ్యత, కొలతలను తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా లోపాలు గుర్తిస్తే కాంట్రాక్టర్‌తో పాటు ఇంజినీరింగ్ అధికారులు, ఎమినిటీ కార్యదర్శులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జేకేసీ కాలేజీ రోడ్డును 15 మీటర్ల వెడల్పు విస్తరించడానికి చర్యలు తీసుకోవాలని, విస్తరణకు అడ్డుగా ఉన్న ఆక్రమణల తొలగింపు చేసి, డ్రెయిన్ టూ డ్రెయిన్ బీటీ రోడ్డు వేయడానికి చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ భాస్కర్, ఈఈ సుందరరామిరెడ్డి, డీఈఈ మహ్మద్ రఫిక్, ఏసీపీ అజయ్ కుమార్, టీపీఎస్ గోవర్ధన్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను శిక్షించడం తగదు: యూటీఎఫ్

గుంటూరు ఎడ్యుకేషన్: వ్యవస్థలో లోపాలకు ఉపాధ్యాయుల్ని శిక్షించడం తగదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. ఆదిలక్ష్మి, ఎం. కళాధర్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల్ని సస్పెండ్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి, కళాధర్ మాట్లాడుతూ బోధన సజావుగా సాగకపోవడానికి అనేక కారణాలు ఉన్నాయని, వాటిని వదిలేసి కేవలం ఉపాధ్యాయుడిని బాధ్యుడిని చేసి, సస్పెండ్ చేయడం కక్ష సాధింపు చర్యగా ఉందని ఆరోపించారు. ప్రదర్శనలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, ఏ.ఎల్.శివపార్వతి, జిల్లా కార్యదర్శులు సీహెచ్. ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎం డీ.షకీలాబేగం, ఎం. గురుబ్రహ్మం, కె.రంగారావు, కోటిరెడ్డి, బి.ప్రసాద్, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

స్త్రీ విద్యకు సావిత్రీబాయి అవిరళ కృషి

నెహ్రూనగర్: భారత తొలి ఉపాధ్యాయిని, అణగారిన కులాల అభ్యున్నతికి కృషి చేసిన గొప్ప ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పాగళ్ల ప్రకాష్ పేర్కొన్నారు. అరండల్‌పేట భీమ్ భారత్ కార్యాలయంలో శుక్రవారం సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భర్తతో కలసి దేశంలో బహుజనులకు మొట్టమొదటి పాఠశాలను సావిత్రీబాయి స్థాపించారని తెలిపారు. స్త్రీల విద్య కోసం నిరంతరం కృషిచేసిన ఆమెను భారతదేశ మహిళలందరూ ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు.

మహిళల హక్కుల పాటుపడిన మహోన్నత వ్యక్తి

మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాటం చేసిన పోరాట యోధురాలు సావిత్రీబాయి పూలే అని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఏసుబాబు కొనియాడారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల విద్యాభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారని తెలిపారు.

అన్ని రంగాల్లో మహిళలు ముందంజ

గుంటూరు ఎడ్యుకేషన్: మహిళలకు పాలిచ్చి పెంచడంతో పాటు దేశాన్ని పాలించడమూ తెలుసునని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి నంబూరు వసంత కుమారి పేర్కొన్నారు. శుక్రవారం జెడ్పీ సమావేశ మందిరంలో సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా ప్రగతి నారీశక్తి – 2023 అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నంబూరు వసంతకుమారి సమక్షంలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపించిన మహిళలకు అవార్డులు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడవాళ్లు అన్నింటిలో సగం అనేది నిన్నటి మాట అనీ, అన్ని రంగాల్లో ఆడవాళ్లు మగవాళ్ల కంటే ముందున్నారని చెప్పారు. మహిళలుగా పుట్టడమే చాలా గొప్ప విషయమనీ, అన్ని రంగాల్లో వారు ప్రతిభను చూపించి ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిడుగురాళ్ల మండలం కామేపల్లి గ్రామానికి చెందిన క్లో మౌనికని దత్తత తీసుకున్న వసంత కుమారి ఆమె విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చు మొత్తం తానే భరిస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నేత నూరి ఫాతిమా, ప్రగతి నారీశక్తి అధ్యక్షురాలు రాజకొండ రాజకుమారి, ఎస్ఎస్ఆర్ ఫౌండేషన్ ఫౌండర్ సురేష్‌కుమార్, రమేష్, సహృదయ ఫౌండేషన్ ఫౌండర్ పోతురాజు శ్రీనివాసరావు, పాట్లూరి రమాదేవి, పట్టీల శ్రీను పాల్గొన్నారు.



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాగళ్ల ప్రకాష్ తదితరులు



సావిత్రీబాయి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వసంతకుమారి

డాక్టర్ మండవ సేవలు అభినందనీయం



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐడీ చీఫ్ సంజయ్ తదితరులు

గుంటూరు మెడికల్: పోలీసు డాక్టర్‌గా, పేదల వైద్యుడిగా డాక్టర్ మండవ శ్రీనివాసరావు సేవలు అభినందనీయమని ఏపీ సీఐడీ చీఫ్ ఎన్.సంజయ్ పేర్కొన్నారు. డాక్టర్ మండవ శ్రీనివాసరావు పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం స్థానిక కొత్తపేటలోని సాయిరత్న మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. సీఐడీ చీఫ్ సంజయ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. తొలుత భారీ కేక్‌ను కట్ చేశారు. క్యాలెండర్‌ను, డాక్టర్ మండవ వైద్య సేవలతో ముద్రించిన పుస్తకాలను సంజయ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ఒత్తిడితో ఇబ్బందులు పడే పోలీసు సిబ్బందికి సైతం ఉచిత వైద్య సేవలు అందించి పోలీసు వైద్యుడిగా గుర్తింపు పొందారని తెలిపారు.కార్యక్రమంలో న్యూరాలజిస్టు డాక్టర్ చక్కా శివరామకృష్ణ, జనసేన నగర అధ్యక్షుడు నేరేళ్ల సురేష్, జీజీహెచ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, డీఎస్పీ సీతారామయ్య, కార్పొరేటర్ పోతురాజు సమత, పలువురు వైద్యులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'దర్పణం' ప్రత్యేక సంచిక ఆవిష్కరణ



ఆవిష్కరణలో పాల్గొన్న ప్రముఖులు

పాత గుంటూరు: వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ సౌజన్యంతో శుక్రవారం గుంటూరు కళా పరిషత్ రజతోత్సవ ప్రత్యేక సంచిక 'దర్పణం' ఆవిష్కరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సభకు కళాపరిషత్ ఉపాధ్యక్షుడు పివి. మల్లికార్జునరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా నాటక రచయిత దీర్ఘాసి విజయ భాస్కర్ పాల్గొన్నారు. ప్రజా నాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు సంచికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక నాటక పరిషత్‌ను ఇరవై ఐదు ఏళ్లుగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. డాక్టర్ దీర్ఘాసి విజయ భాస్కర్ మాట్లాడుతూ గుంటూరు కళలకు, కళాకారులకు పుట్టినిల్లు లాంటిదన్నారు. ప్రభుత్వాలు ఆదరిస్తేనే కళలు రాణిస్తాయని చెప్పారు. నాటకాలను మరింతగా ఆధునికీకరణ చేయాల్సిన బాధ్యత సమాజాలపై ఉందని తెలిపారు. దర్పణం సంచికను సాహితీవేత్త యల్లాప్రగడ మల్లికార్జునరావు సమీక్షించారు. అనంతరం జ్ఞానపీఠ అవార్డు గ్రహీత రావూరి భరద్వాజ రచన 'పాకుడురాళ్లు' నాటకాన్ని నిభా థియేటర్ ఎన్సెంబుల్ ఆధర్యంలో ప్రదర్శించారు. నాటకం ప్రేక్షకులను ఆకట్టుకుంది. నస్రీన్ ఇషాక్ దర్శకత్వం వహించారు. అనంతరం నస్రీన్ ఇషాక్‌ను, కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దర్పణం సంపాదకుడు వల్లూరు శివప్రసాద్, కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి బి. పూర్ణ, గౌరవాధ్యక్షుడు అలోకం పెద్దబ్బయ్య, అధ్యక్షుడు వల్లూరు తాండవ కృష్ణ, ఉపాధ్యక్షుడు నాయుడు గోపి, కార్యదర్శి గుమ్మడి నాగేశ్వరరావు, పలువురు ప్రముఖులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ఉద్యోగుల హక్కుల కోసం శ్రీరాములు పోరాటం



శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఏపీ ఎన్జీవో నేతలు

గుంటూరు మెడికల్: ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు ఆమనగంటి శ్రీరాములు 102వ జయంతి వేడుకల్ని శుక్రవారం గుంటూరులోని ఏపీ ఎన్జీవో హోంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం మీద శ్రీరాములు ఒంటరి పోరాటం చేసి, ఉద్యోగుల హక్కుల్ని సాధించారని వెల్లడించారు. జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ వ్యవస్థ గురించి తెలియని రోజుల్లో ఊరూరు తిరిగి, హక్కులను గురించి వివరించి వ్యవస్థను కాపాడిన వ్యక్తి శ్రీరాములు అని కొనియాడారు. అన్ని రాష్ట్రాల్లోని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల్ని ఒక వేదిక మీదకు తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని తెలిపారు. అనంతరం శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కె.ఎస్.సుకుమార్, హరిబాబు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్. సూరి, కార్యదర్శి చింతల కల్యాణ్ కుమార్, జిల్లా చైర్‌పర్సన్ ఎం.రాధారాణి, కన్వీనర్ కె.లక్ష్మీరమ్య పాల్గొన్నారు.

స్త్రీల విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే కృషి

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



సావిత్రీబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే సుచరిత

గుంటూరు రూరల్: స్త్రీల విద్యాభివృద్ధి, హక్కుల కోసం కృషి చేసిన తొలి తరం మహిళా ఉద్యమకారిణి సావిత్రీబాయి పూలే అని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ స్త్రీల అభివృద్ధికి విద్యే మార్గమని నాడు సావిత్రీబాయి చేసి కృషి వల్ల అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అదే బాటలో నేడు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పయనిస్తూ విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని వివరించారు. అన్ని రంగాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించిన ఘనత మన జగనన్నకే దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ మెట్టు రాజేశ్వరి, ఆర్ అండ్ బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆవుల సుందర్‌రెడ్డి, తురకపాలెం సొసైటీ చైర్మన్ తంగెళ్ల నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, బండారు శ్రీనివాసరావు, ముత్యాల రాజు, రాంజీ అంబేడ్కర్, శివసాయి, కందుల జ్యోతి, ఏసోబు, దావీదు, బాజీ, పుట్టా బాజీ పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ.. దాడి

గుంటూరు ఈస్ట్: పాత కక్షల నేపథ్యంలో ఇరువర్గాలు దాడి చేసుకున్న ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కొండా వెంకటప్పయ్య కాలనీ 1వ లైనులో శుక్రవారం అశోక్ నిలబడి ఉండగా, అబ్రహం దాడి చేశాడు. అనంతరం అశోక్ అనుచరులు డేవిడ్, ఆదాం, సాల్మన్, దావీదులను వెంటబెట్టుకుని అబ్రహంపై దాడి చేశాడు. అతడి అనుచరులు ప్రవీణ్, అస్రఫ్, బబ్లూలు తిరిగి అశోక్ అనుచరులపై దాడికి పాల్పడ్డారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.